

కొనసాగిన న్యాయవాదుల నిరసన

నరసాపురం టౌన్ :రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎపి భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం న్యాయవాదులు చేపట్టిన నిరసన కొనసాగింది. మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు బయట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ నాయకులు చల్లా దానయ్య నాయుడు, సోడదాసి శ్రీధర్, కొప్పినీడి చిట్టిపద్మజ, దొంగ నరసింహరాజు, పులపర్తి హర్షవర్ధన్, డి.ఛాముండేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టంతో ప్రజల ఆస్తులకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వెంకటరామారెడ్డి, పోలిశెట్టి శ్రీరఘు రామారావు, పి.వీర వెంకట నారాయణ స్వామి(బాబ్జీ), రామారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి మాట్లాడారు. తక్షణం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పాల్గొన్నారు.

లస్కర్లను.. పట్టించుకోరా..!

11 నెలల వేతనాలు పెండింగ్
ఏడాదికి 10 నెలలే జీతాల చెల్లింపు
సమాన పనికి సమావేతనం, ఉద్యోగ భద్రత కరువు
రబీ సాగునీటి సరఫరాలో లస్కర్లదే ప్రధానపాత్ర
నేరుగా సిఎంకు వినతులిచ్చినా ఫలితం శూన్యం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో డెల్టాలోని వ్యవసాయరంగానికి సాగునీటి సరఫరాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న లస్కర్లపట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏళ్లతరబడి పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలుగానీ, ఉద్యోగ భద్రత లేకపోగా, వేతనాలు కూడా సకాలంలో అందించడం లేదు. దీంతో లస్కర్లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని డెల్టా ప్రాంతంలో ప్రస్తుత రబీలో 8.96 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌లో సైతం ఇదేస్థాయిలో పెద్దఎత్తున సాగుచేపట్టారు. ప్రతిఏటా ఇదేవిధంగా డెల్టా ఆయుకట్టు పరిధిలో వ్యవసాయం చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం ఆనకట్ట ఆయకట్టు పరిధిలో నీటి సరఫరా సక్రమంగా సాగేందుకు కాలువలపై లస్కర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దశాబ్దాల కాలంగా వీరంతా కాలువలపై పనిచేస్తున్నారు. ధవళేశ్వరం సర్కిల్‌లోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 610 మంది లస్కర్లు కాలువలపై పనిచేస్తున్నారు. రబీలో ప్రతిఏటా నీటిఎద్దడి సమస్య వెంటాడుతోంది. ప్రస్తుత రబీలో సైతం రెండు జిల్లాలకు 91.35 టిఎంసిల సాగునీరు అవసరంకాగా 82.49 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వంతులవారీ విధానంలో సాగునీరు అందిస్తే తప్ప రబీసాగుగట్టెక్కే పరిస్థితి ఉండదు. ప్రతిఏటా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో సాగునీటి సరఫరాలో లస్కర్లది కీలకపాత్రగా మారింది. ఇంతముఖ్యమైన విధులు నిర్వహిస్తున్న లస్కర్ల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. లస్కర్లు ఏడాదిలో 12 నెలలు పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఏప్రిల్, మే నెల వదిలేసి పదినెలలకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. అదికూడా నెలకు రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రస్తుత ధరలకు ఈ వేతనం ఏ విధంగా సరిపోతుందో ప్రభుత్వం చెపాల్సి ఉంది. ఈ వేతనం కూడా నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించి డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చినెలలకు సంబంధించి నాలుగునెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. 2023-24 ఏడాదికి సంబంధించి జూన్ నుంచి డిసెంబర్ వరకూ ఏడునెలల బకాయిలు పెండింగ్ ఉంది. మొత్తం 11 నెలల వేతనబకాయిలు లస్కర్లకు ఇవ్వాల్సి ఉంది. నరసాపురం, భీమవరం సిఎం పర్యటనల్లో నేరుగా సిఎంకు వినతిపత్రాలిచ్చినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.

లస్కర్లకు ఉద్యోగ భద్రతఏదీ?

సాగునీటి సరఫరాలో భాగంగా లస్కర్లు కాలువలపై పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిరోజు కిలో మీటర్ల మేర తిరగాలి. రాత్రిపూట గస్తీకాయాలి. దీంతో విషసర్పాల నుంచి నిత్యమూ ప్రమాదం పొంచిఉంటుంది. లస్కర్లకు ఉద్యోగ భద్రత అనేది లేకుండా పోయింది. ఏడాదిలో పదినెలలకే వేతనాలిస్తూ దారుణంగా మోసం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లస్కర్ల జీతాలు నేరుగా 'ఎపిసిఒఎస్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్సింగ్' సర్వీస్‌కు అనుసంధానం చేసి నేరుగా బ్యాంకు ఖాతాలకు జమచేయాలని లస్కర్లు కోరుతున్నారు. సిఎం స్థాయిలో వినతిపత్రాలిచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన..
నేడు 12 గంటల ధర్నా

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి
యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వారిని దోచుకున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి విమర్శించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. జిల్లా కేంద్రంలో ఈనెల 3న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ 12 గంటల పాటు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపీమూర్తి మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు, టైం టు టైం డిఎ, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని చెప్పడంతో పాటు సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేస్తానని అనేక వరాల జల్లులు కురిపించారన్నారు. ఐదేళ్లు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పదో తేదీ దాటితే తప్ప జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పిఆర్‌సి అరియర్లు రూ.6,246 కోట్లు, పిఆర్‌సికి ముందు డిఎ బాకీలు రూ.1136 కోట్లు, పిఆర్‌సి తరువాత డిఎ అరియర్ బాకీలు రూ.4884 కోట్లు, పిఎఫ్ లోన్లు ఫైనల్ సెటిల్మెంట్ల బాకీలు రూ.వెయ్యి కోట్లు, ఎపిజిఎల్‌ఐ లోన్లు ఫైనల్ సెటిల్మెంట్ల బాకీలు రూ.330 కోట్లు తదతర బాకీలు వెరసి మొత్తం రూ.18 వేల 96 కోట్లు ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి పడిందన్నారు. 2023లో బకాయిలు ఇస్తామని ఇచ్చి హామీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల మూడో తేదీన 12 గంటల పాటు ధర్నా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వ స్పందించకపోతే విజయవాడలో ఈ నెల 9, 10 తేదీల్లో 36 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దశలవారీ పోరాటంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ఉపాధ్యాయులు అవసరం నిమిత్తం దాచుకున్న డబ్బులను తీసుకోవడం వల్ల పిల్లల పెళ్లిళ్లకు, గృహ నిర్మాణాలకు, అనారోగ్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శిడి ఎస్.బాబు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

8వ రోజు కొనసాగిన సమ్మె



భీమవరంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతామని తెలిపారు. కార్మికులు శాంతి యుతంగా సమ్మె చేస్తుంటే పోటీ కార్మికులను తీసుకొచ్చి కార్మికుల పట్ల ఘర్షణ పెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సంఘం నాయకులు నాగేంద్రకుమార్, తాడిపత్రి దుర్గ, ఎస్.సత్యనారాయణ, చిరంజీవి, కృష్ణబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ మేరకు మంగళవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు కర్రి నాగేశ్వరరావు, ఎస్.సతీష్, టి.భాను, దయామణి, దుర్గ నాయకత్వం వహించారు.

భీమవరం రూరల్ : అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని, కార్మికులతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ జెఎసి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా ఆఫీస్ మీదుగా ప్రకాశం చౌక్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు మాట్లాడారు. ధర్నాలో మున్సిపల్ జెఎసి నాయకులు జి.నాని, ఎస్.విశ్వనాథం, రాజు, బంగారు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోమంటారా.. సమస్యలు పరిష్కరిస్తారా అని మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగింది. ఈ మేరకు కార్మికులు మెడకు ఉరితాడు వేసుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.తవిటి నాయుడు, కార్మిక నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, నరేష్, బంగారు శ్యాం, ఎస్.రమణ దాణా దేవి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జగనన్న సురక్షను వినియోగించుకోండి

రెండో విడత ప్రారంభించిన కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మంగళవారం మండలంలోని కలిగొట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని రాష్ట్ర నోడల్ అధికారి జె.విజయలక్ష్మితో కలిసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి లాంఛనంగా ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో రూమ్‌లు, కంప్యూటర్ డేటా సెంటర్‌ను, హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, మందుల కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్ కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలు పొందడానికి వచ్చిన ప్రజలతో కలెక్టరు మాట్లాడారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందరికీ ఉన్నాయా, ఇది వరకూ 5 లక్షల రూపాయలకు మాత్రమే వైద్యం అందే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఒక కుటుంబం రూ.25 లక్షల వరకూ వైద్యం పొందొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆరోగ్యంతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యతిచ్చిందని తెలిపారు. మండలాల్లో వారానికో క్యాంపు జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో, పట్టణాల్లో బుధ, గురువారాల్లో జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, తహశీల్దారు ఏడిద శ్రీనివాస్, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తాడో.. పేడో..

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం
సమస్యలు పరిష్కరించకుండా ప్రతీకారచర్యకు దిగడం సిగ్గుచేటు
22వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
నేడు భీమవరంలో నిరసన ప్రదర్శనకు సిఐటియు పిలుపు



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

ఎన్ని సమస్యలున్నా భరించాం.. ఎంత పని ఒత్తిడి ఉన్నా సహించాం.. ఆర్థిక, మానసిక, వేధింపులను తట్టుకున్నాం. నాలుగున్నర ఏళ్లుగా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురుచూసి సమ్మెలోకి వెళ్లాం. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రతీకార చర్యలకు పాల్పడుతుంటే తాడో పేడో తేల్చుకునేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 22వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా నేడు భీమవరంలో అంగన్‌వాడీల నిరసన ప్రదర్శనకు సిఐటియు పిలుపునిచ్చింది. వేలాది మంది అంగన్‌వాడీలు నిరసనలో పాల్గొనేందుకు సమాయత్వం అయ్యారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. అనేక రూపంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టినప్పటికీ ప్రభుత్వం సానుకూలత చూపించలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు తప్పని పరిస్థితుల్లో మూకుమ్మడిగా సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మె చేపట్టి 22 రోజులు కావస్తున్నా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. మూడు సార్లు యూనియన్ నేతలతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ సానుకూలంగా వ్యవహరించకుండా ప్రతీకార చర్యకు పూనుకుని అధికార బలాన్ని ఉపయోగించి అంగన్‌వాడీల పట్ల బెదిరింపులకు పాల్పడుతోంది. జిల్లాలో మినీ, మెయిన్ కలిపి 1626 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో అంగన్‌వాడీ టీచర్లు 1626 మంది, సహాయకులు 1556 మంది పనిచేస్తున్నారు. బాలింతలు 9,169 మంది, గర్భిణుల 7,311 మంది, ఆరేళ్లలోపు చిన్నారులు 15,299 మంది కేంద్రాల ద్వారా అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కీలకపాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి అవలంబిస్తోంది. సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని దూరం చేసి కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. అయితే అంగన్‌వాడీలు మాత్రం ఆచంచల ఆత్మవిశ్వాసంతో పోరాటం కొనసాగిస్తున్నారు. సమ్మె చేపట్టి నేటికి 22 రోజులు కావస్తున్నా వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అంగన్‌వాడీలు తమ సమ్మె, ఆందోళనలు కొనసాగిస్తూ వినూత్న రీతిలో నిరసనలు ముమ్మరం చేశారు. సమ్మెను కొనసాగిస్తున్నారు.

నేడు భీమవరంలో నిరసన ప్రదర్శన..

సమ్మె చేపట్టి 22 రోజులైనా ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడంతో సమ్మెను మరింత ఉధృతం చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా భీమవరంలో నిరసన ప్రదర్శనకు సిఐటియు పిలుపునిచ్చింది. స్థానిక పాత బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ తెలిపారు. లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ ఎదురు రోడ్డులో నిరసన సభ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వేల మంది అంగన్‌వాడీలు తరలి రానున్నారని నిరసన హోరుతో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మడమ తిప్పేదే లేదు..

డి.లక్ష్మీ ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్, గుట్లపాడు



మాట ఇస్తే మడమ తిప్పనని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు మరిచారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె ఆపేదేలేదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి సమస్యలు పరిష్కరించాలి. లేకపోతే అధోగతి తప్పదు.

ఎన్ని అవరోధాలు సృష్టించినా భయపడం

టి.కనకరత్నం, అంగన్‌వాడీ టీచర్, దొంగపిండి



సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు అడిగిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు న్యాయ పోరాటం చేస్తుంటే కక్ష సాధింపులకు దిగుతోంది. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ఎన్ని అవరోధాలు సృష్టించిన భయపడే ప్రసక్తే లేదు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ముందుకు సాగుతాం.

మేం చేసిన తప్పేంటి

బి.నాగమణి, అంగన్‌వాడీ ఆయా, యనమదుర్రు



బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రతినెలా క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం చెప్పే అన్ని సర్వేలూ, అన్ని రకాల పనులూ చేస్తున్నాం. మా సమస్యలు పరిష్కరించాలని అడగడమే మేం చేసిన తప్పా. 22 రోజుల నుంచి కుటుంబాన్ని వదిలి సమ్మె చేస్తున్నాం. అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంచూపడం దారుణం. సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే సమ్మె ఆగదు.

నిరంకుశత్వానికి నిదర్శనం

ఎల్. వెంకట నాగ దుర్గమ్మ, అంగన్‌వాడీ ఆయా, భీమవరం



కుటుంబాన్ని పక్కనపెట్టి సమస్యల పరిష్కారం కోసం 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యం నిరంకుశత్వానికి ఇదే నిదర్శనం. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుగుతుంటే కక్ష పూరితంగా వ్యవహరించడం దుర్మార్గం.

అంగన్‌వాడీలు 5లోపు విధులకు హాజరు కావాలి

హాజరుకాకుంటే శాఖాపరమైన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా ప్రయోజనాల దృష్ట్యా అంగన్వాడీలు సమ్మె విరమించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. ఈ నెల 5వ తేదీలోపు విధులకు హాజరుకావాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు డిమాండ్లలో ఇప్పటికే కొన్ని డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ప్రతినిధులతో మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ముఖ్య అధికారులు వివిధ స్థాయిల్లో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపి వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించడంతో పాటు, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల, పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు, నిర్వహణ ఛార్జీలు విడుదల చేసినట్లు తెలిపారు. 2013 తరువాత తొలిసారిగా ఉద్యోగోన్నతులు కల్పించడం, సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షల వయోపరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి రెండు లక్షల వరకూ ప్రమాద బీమా ప్రయోజనం కల్పించినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు సమ్మె కారణంగా విధులకు హాజరు కాకపోవడంతో పోషకాహార కిట్లు, గుడ్లు, పాలు, సప్లిమెంటరీ న్యూట్రిషన్ లబ్ధిదారులకు అందడం లేదని, అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పరిమితులపై పర్యవేక్షణ కొరవడిందని తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సేవలను కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు.



కళ్లకు గంతలు కట్టుకుని, మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఉరితాళ్లతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రామికుల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సిఐటియు పెనుమంట్ర మండల నాయకులు కె.సుబ్బరాజు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఆయన మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజుల నుంచి న్యాయ పోరాటం చేస్తున్న ఉద్యోగులు సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని, మెడకు ఉరితాడు బిగించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బాలాజీ మాట్లాడుతూ ఉద్యోగుల ఆవేదనను ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలని, న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

నారాయణమూర్తికి డైరెక్టర్ వివి.వినాయక్ పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రముఖ వ్యాపారవేత్త ఎఎస్ఆర్ సంస్థలో ఒకరైన అడబాల నారాయణమూర్తి (బాబులు)ని స్వగ్రామం నవుడూరులో ఆయన ఇంటికి వెళ్లి సినీ దర్శకుడు వివి.వినాయక్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు అడబాల సత్యనారాయణ మూర్తి గుండెపోటుతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎఎస్ఆర్ కుటుంబ సభ్యులతో ఉన్న సాన్నిహిత్యంతో వివి నాయక్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైసిపి వీరవాసరం గ్రామ అధ్యక్షుడు నూకల కనకారావు, స్థానికులు ఉన్నారు.



నారాయణమూర్తిని పరామర్శిస్తున్న డైరెక్టర్ వివి.వినాయక్

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర మంత్రి పర్షోత్తమ్‌రూపాలా

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతుల సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. మండలంలోని వాండ్రం గ్రామంలో మంగళవారం నిర్వహించిన సాగర్ పరిక్రమ ఫేస్‌ఎక్స్ 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు, మత్స్యకారుల సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఆక్వా రైతులు మాట్లాడుతూ గతంలో నెదర్లాండ్ నుంచి నాణ్యమైన రొయ్యల సీడ్ వచ్చేదని, ఇప్పుడు స్థానికంగా నాణ్యమైన అందుబాటులో లేని కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రస్తుతం ఆక్వా రంగానికి పది ఎకరాల పైన రైతులకు రాష్ట్రం విద్యుత్ సబ్సిడీ ఎత్తేసిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సబ్సిడీలో కేంద్రం సహకరించాలని కోరారు. మేతల ఖరీదు పెరిగి, రొయ్యల అమ్మకం ధర తగ్గిన కారణంగా ప్రస్తుతం నూటికి ఇరవై శాతం మాత్రమే రైతులు రొయ్యల సాగు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం రొయ్యల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు తగవు : మంత్రి సిదిరి అప్పలరాజు

ఆక్వా రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంలేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంపై రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు తీవ్ర అసహనం చేశారు. ఆక్వా రైతులు ఉత్పత్తి చేసిన సాగును వారే అమ్ముకోవాలని, వారికి కావాల్సిన మద్దతు రాష్ట్ర ప్రభుత్వం అందించినప్పటికీ రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. ఆక్వా ఉత్పత్తిని రైతులే అమ్ముకోవాలని, వారికి కావాల్సిన సహకారం రాష్ట్ర ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, అప్సడ వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురాం పాల్గొన్నారు.

జవహర్‌రెడ్డిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ చీఫ్ సెక్రటరీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టీముకు తరుణ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.తరుణ్ రెండు రోజులుగా నరసాపురం వైఎన్.కళాశాలలో జరిగిన నన్నయ యూనివర్సిటీ క్రికెట్ మెన్స్ టీం సెలక్షన్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి నన్నయ్య యూనివర్సిటీ క్రికెట్ టీంకు ఎంపికయ్యారు. ఈ నెల ఏడో తేదీన చెన్నయ్ హిందూస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎం.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ జి.మహేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ


ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని మాలవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు మంగళవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణరాజు మాట్లాడారు. ఈ హైస్కూల్లో పదో తరగతి చదివే 30 మంది విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు లక్ష్మీనరసింహపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య చేతులమీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు, సిహెచ్.వెంకటరత్నం, పి.అప్పలస్వామి, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరకలో జిఎస్‌పి రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. మండలంలోని కొడమంచిలిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. టి.మెరక, తీర్థాలపుంత, బిపి చెరువు కాలనీ వాసులతో పాటు పెదమల్లం, కోడేరు పరిధిలోని ఉత్తరపాలెం గ్రామాల ప్రజలకు రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న పివిఎల్.నరసింహరాజు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. పెనుమంట్ర 1, 2 సచివాలయాల సంబంధించి క్రికెట్ పోటీలు పెనుమంట్ర జూనియర్ కాలేజ్ ఆవరణలో, మార్టేరు, సత్యవరం సచివాలయాల సంబంధించి క్రికెట్ పోటీలు మార్టేరు ఎస్‌విజిఆర్ హైస్కూల్ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కరువు

పోడూరు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను వెలికి తీయడానికి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను కనీస సౌకర్యాలు లేకుండా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ఆట మైదానాలను సరిగ్గా చదును చేయకుండా, సరైన కోర్టులను సిద్ధం చేయకుండానే క్రీడలను నిర్వహిస్తున్నారు. ఆటలు ఆడే క్రీడాకారులకు మధ్యలో ఏమైనా గాయాలైతే ప్రాథమిక చికిత్స అందించడానికి కనీసం ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయలేదు. కొన్ని గ్రామాల్లో క్రీడాకారులకు కిట్లు అందించకపోవడంతో సొంత క్రీడా సామాగ్రితోనే వచ్చి ఆటలు ఆడుతున్నారు. ఆటలు ఆడటానికి తొలుత ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులకు సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది క్రీడాకారులు తను ఎంచుకున్న ఆట ఎప్పుడో తెలియకుండానే జరిగిపోతున్నాయి. క్రీడల పట్ల సరైన అవగాహన లేకుండా ఉన్నవారిని అంపైరింగ్ పెట్టడంతో పాయింట్ల విషయంలో, అవుట్ల విషయంలో ఆట మధ్యలో తీవ్ర గందరగోళం ఏర్పడుతుందని క్రీడాకారులు చెబుతున్నారు. ఇక నుంచి నిర్వహించే ఆటలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'దళితులకు సిఎం జగన్ అన్యాయం'

పాలకొల్లు : దళితులకు సిఎం జగన్ అన్యాయం చేశారని టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ నాయకులు అన్నారు. పట్టణంలోని 27వ వార్డు దళిత ప్రాంతాల్లో ఆయా పార్టీల ఎస్‌సి నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం దళితులకు అమలయ్యే 27 పథకాలను రద్దు చేసిందన్నారు. దళితులకు రద్దు చేసిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

కాళ్ల : జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.మూడు వేల పింఛన్ అందిస్తున్నామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్‌ఆర్ పింఛన్ కానుక పెన్షన్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, కాళ్ల సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్ల రాంబాబు, నిమ్మల వెంకటరత్నం, గుండా సాయి పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు పాల్గొని పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

22వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్ వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 22వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు.

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం 22వ రోజు సమ్మెలో భాగంగా మెడలకు ఉరితాడులు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు స్వరూపరాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు, ప్రభారాణి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో....

ఆచంట (పెనుమంట్ర) : సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం 22వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షల నేపథ్యంలో దున్నపోతు, కోతి పిల్లకు వినతిపత్రాలు అందించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్టేరు,


కాళ్లలో...

పెనుమంట్ర, ఆలమూరు సెక్టార్ నాయకులు సాయిమహాలక్ష్మి, మౌనిక, సరస్వతి, శాంతికుమారి, సులోచన, రాణి, శాంతి, టిఎల్‌డి భవాని, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఆదిలక్ష్మి, లక్ష్మితో పాటు కార్యకర్తలు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు సంఘీభావం తెలిపారు.

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో దున్నపోతుకు వినతిపత్రం అందించి పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, పి.పద్మ, మహేశ్వరి, జి.కమల, సత్యవతి, ఝాన్సీ, మంగతాయారు, వరలక్ష్మి, వెంకాయమ్మ, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలో అంగన్‌వాడీలు జగన్ ఫొటోకు నమస్కరిస్తూ పొర్లు దండాలు పెట్టారు. అనంతరం దున్నపోతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల లీడర్ కె.తులసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.నాగలక్ష్మి, కుసుమే శ్రీదేవి పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలో అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు పెంకి అప్పారావు, అంగన్‌వాడీ నాయకులు పైడేశ్వరి, సరస్వతి, కృష్ణవేణి, కృష్ణకుమారి, కనకదుర్గ, దుర్గాదేవి, ఇరానీ దేవి, అమ్మాజీ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పాలకోడేరు : తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో అంగన్‌వాడీలు రోడ్డుపై పొరివి దండాలు పెట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విమల, విజయలక్ష్మి, విమలకుమారి, ధనలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గడ్డి తింటూ తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, అంగన్‌వాడీ నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, జి.ఝాన్సీరాణి, బి.అభిరాణి, ఎం.భవాని పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పొరివి దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్దింట్లు, సారమ్మ, సీత, రేఖ శాంభవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవసుధాకర్, అంగన్‌వాడీ నాయకులు రజని, పద్మశ్రీ, దేవి పాల్గొన్నారు.

పెంటపాడు : సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు మెడలకు ఉరితాడులు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు శ్యామలాకుమారి, ఆర్.అనురాధ, వి.కనకమహాలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు


పాలకోడేరులో...

సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.జయలక్ష్మి, నాగమణి, కెవి.వరలక్ష్మి, దేవి, కె.గాయత్రి, టి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : పోడూరులో పొరివి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తణుకులో పొరివి దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పివి.ప్రతాప్, గార రంగారావు రాజకుమారి, బి.కనకరోజాకుమారి, బి.వసంతకుమారి, వి.ప్రమీల పాల్గొన్నారు.

కాళ్ల : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా


ఆచంటలో...

సెక్రటరీ జక్కంశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడనాడి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ లీడర్ దావులూరి మార్తమ్మ, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, ఎ.నీలిమా, జి.శ్రీలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, భోగేశ్వరమ్మ, జి.విజయలక్ష్మి, ఎస్.ఉమాకృష్ణవేణి పాల్గొన్నారు.

ఉండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు చైతన్య, సత్యవేణి, గడి కుసుమ, వీరవల్లి వెంకటలక్ష్మి, కుసుమ, జయశ్రీ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : అంగన్‌వాడీలు పొరివి దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరం వద్దకు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి చేరుకుని మాట్లాడారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చైతన్య ప్రసాద్ ఆటలు ఆడి చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కల్యాణి, నాయకులు విజయలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, పాలపర్తి అనిత, శాంతికుమారి, కె.వరలక్ష్మి, టి.పద్మ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో అంగన్‌వాడీలు జగన్ చిత్రపటం ఎదుట పొరివి దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గణపవరం అంగన్‌వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, సిహెచ్.సీతామహాలక్ష్మి, ఎస్.లక్ష్మి, జె.ప్రవీణ, కె.ధనలక్ష్మి, వి.రాశి, బి.రామలక్ష్మి, పి.ఇందిరామణి, ఎ.కల్యాణి పాల్గొన్నారు.

కల్యాణ్‌వర్మకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉండి

నాలుగు నెలల కాలం నుంచి అయ్యప్పస్వాములకు, భవాని భక్తులకు, శివ స్వాములకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేసిన ఉండి గ్రామ ఉపసర్పంచి గొట్టుముక్కల కల్యాణ్ వర్మను అయ్యప్ప స్వామి భక్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ గత నాలుగు నెలల కాలం నుంచి రోజుకు సుమారు వంద మందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కల్యాణ్ వర్మ మాట్లాడుతూ తాను తన మిత్రుడు సాగిరాజు హరి వర్మ సహకారంతో గత రెండు సంవత్సరాల నుంచి ఉచితంగా అయ్యప్పలకు, భవానీలకు, శివ స్వాములకు భోజన సదుపాయం ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

'బేటీ బచావో-బేటీ పడావో'పై సమీక్ష

వీరవాసరం : బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంపై వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు అధ్యక్షతన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ గర్భిణులు తమ పేర్లను ఆరోగ్యకేంద్రంలో నమోదు చేయించుకుని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

'చేనేతకు సముచిత స్థానం కల్పించాలి'

ఆచంట (పెనుమంట్ర) : రాష్ట్రంలో చేనేతలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అన్ని రాజకీయ పార్టీలు చేనేత వృత్తిదారులలకు ఎంఎల్‌ఎ, ఎంపీ టికెట్లు ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు అల్లాడ సూర్యభాస్కరరావు పిలుపునిచ్చారు. మార్టేరులోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విధాలుగా అర్హతలు ఉన్న చేనేత వర్గాలకు చెందిన రాజకీయ నాయకులకు ఎంఎల్‌ఎ, ఎంపీ టికెట్లు ఇచ్చి రాజకీయ పార్టీలు చేనేత వర్గాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని మహదేవపట్నం, పెదపుల్లేరు గ్రామాల్లో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు తనయుడు కనుమూరి భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారులు, డ్రెయినేజీ నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీ రఘురామకృష్ణంరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహదేవపట్నం గ్రామ సర్పంచి వణిమా సుబ్బలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు కొత్తపల్లి నాగరాజు, పేరిచర్ల కృష్ణంరాజు, శివరామరాజు, కాగిత బుజ్జి, వత్సవాయ సుజాత, ఎంపిటిసి సభ్యులు బొక్కా వీరబాబు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

రహదారులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. భీమవరం ప్రధాన రహదారి నుంచి మహదేవపట్నం మీదుగా చిలుకూరు వెళ్లే రాష్ట్రీయ రహదారికి పివిఎల్.నరసింహ రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, గ్రామ ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు మాట్లాడారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, వైస్ ఎంపిపి గుత్తుల కనకమహాలక్ష్మి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ఆటలు పోటీలు

పాలకొల్లు : స్థానిక లజపతిరాయ్ పేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వార్షిక ఆటల పోటీలను ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా వికాసంతో పాటు, శారీరక వికాసం, మానసిక వికాసం కూడా చాలా అవసరమన్నారు. శారీరక వికాసం కోసం ప్రతి పాఠశాలలో కూడా ఆటలు పోటీలు నిర్వహించడం అత్యవసరమన్నారు. ఈ సందర్భంగా స్కూల్, జూనియర్ కళాశాల డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్‌కెపిఎస్.ప్రకాష్‌రావు, ఎంఇఒ వీరాస్వామికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి సత్కరించారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఉచిత యోగా శిక్షణ తరగతులు వరాహ స్వామి కళ్యాణ మండపంలో మానవత స్వచ్ఛంద సంస్థ సంస్థ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. యోగా మాస్టర్ పడాల రామచంద్రారెడ్డి యోగాలో పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలు గురించి వివరించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని గొంది గ్రామం మండల పరిషత్ హై స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. అనంతరం జగనన్న ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోని, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

కాళ్ల : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపిపి శిరీష విశ్వనాథరాజు అన్నారు. మండలంలోని బొండాడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి శిరీష విశ్వనాథరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య రంగంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఓ మరుపురాని ఘట్టంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీని ఉపయోగించుకుని వైద్య సదుపాయం పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచి మన్నే వరలక్ష్మి నాగరాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.మోహన్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గులాబ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆచంట : ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలఅందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని సర్పంచి కోట సరోజినీవెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక రామేశ్వరస్వామి కల్యాణ మండపంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి కోట సరోజినీవెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఇఒపిఆర్‌డి, మూర్తిబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రజల వద్దకే వైద్యం పూర్తి స్థాయిలో అందించే విధంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సురక్ష - 2 స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపును పాలకోడేరు మండల వైద్యాధికారి డాక్టర్ రంగంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పాలకోడేరులో నిర్వహించారు. ఈ క్యాంపు ఎంపిపి చంటిరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచి వెంకటరాజు, డాక్టర్ స్వర్ణ నిరంజని, లీలాలక్ష్మి, సిహెచ్‌వి.సత్యనారాయణ, వైసిపి మండల నాయకుడు రాధాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.